## వాహనదారులు నిబంధనలు పాటించాలి

- ఖానాపూర్ సీఐ సైదారావు


సమావేశంలో పాల్గొన్న వాహనదారులు

కడెం, మార్చి 31: వాహనదారులు ప్రమాదాల నివారణకు నిబంధనలు పాటించాలని ఖానాపూర్ సీఐ సైదారావు సూచించారు. కడెం మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ప్రయాణికులను గమ్యసానాలకు సురక్షితంగా చేర్చాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ,కారు నడిపేవారు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. వాహన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. అతివేగం ప్రమాదకరమన్నారు. కడెం ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, వాహనదదారులు, తదితరులున్నారు.

## విద్యార్థికి చేయూత


కావ్యకు ల్యాప్‌టాప్ అందజేస్తున్న వినోద్ రెడ్డి

ముథోల్, మార్చి, 31: మండలంలోని అష్టా గ్రామానికి చెందిన బొడ్డు కావ్య హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతుంది. ఆమె ఉన్నత చదువుల నిమిత్తం గ్రామానికి చెందిన పట్టేపూర్ వినోద్ రెడ్డి ల్యాప్‌టాప్‌ను అందజేశారు. యువత చదువుల్లో రాణించి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.


దిలావర్‌పూర్. న్యూ లోలంలో ఆయిల్‌పామ్‌తోట

# ఆయిల్ పామ్.. లాభాల పంట

- నాలుగో ఏడాది నుంచి దిగుబడి
- అప్పటి వరకు అంతర్ పంటల సాగు
- జిల్లాలో పెరుగుతున్న ఆసక్తి


ఆయిల్ పామ్ తోటలో అంతర పంటగా నువ్వు వేసిన రైతు

దిలావర్‌పూర్, మార్చి 31 : దేశీయంగా ఆయిల్‌పామ్ ఉత్పత్తులకు డిమాండ్ పెరడగంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పంట సాగు విషయంలో రైతులను ప్రోత్సహిస్తున్నాయి. ఇతర పంటలతో పొలిస్తే తక్కువ శ్రమ, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి లాభాలు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. సంప్రదాయ పంటలైన నువ్వు, వేరుశనగ, పొద్దుతిరుగుడు కంటే ఆరు రెట్లు ఎక్కువ దిగుబడి వ స్తుందని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. నిర్మల్ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు రైతులకు రాయితీలు కూడా అమలు చేస్తున్నారు.

### నిర్మల్ జిల్లాలో...

నిర్మల్ జిల్లాలో 2023- 24 సంవత్సరంలో 8వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 2600 ఎకరాల్లో సాగు చేశారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. అప్పటి సర్కారు ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు గాను జిల్లాలో వ్యవసాయ శాఖ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారిని పోత్సహించడంతో రైతులు ఈ పంటను సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు.

### అందుబాటులో ఆయిల్‌పామ్ నర్సరీ

జిల్లా కేంద్రానికి 12 కిలో మీటర్ల దూరంలో సారంగపూర్ మండలంలోని బీరవెల్లి సమీపంలో రైతులకు అందుబాటులో ఆయిల్‌పామ్ నర్సరీని ఏర్పాటు చేశారు. ఈ నర్సరీ ద్వారా నర్సాపూర్(జీ), దిలావర్‌పూర్, సారంగపూర్, నిర్మల్, మామడ, లక్ష్మణచాంద మండలాలకు చెందిన రైతులు కావల్సిన మొక్కలను తీసుకెళ్తున్నారు.

### మూడెకరాల్లో సాగు చేస్తున్న..



నాకున్న మూడెకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నా. రెండేళ్లు పూర్తయ్యింది. మొక్కల పెరుగుదల బాగానే ఉంది. అంతరపంటలు కూడా సాగు చేస్తున్నా. వానకాలం సీజన్‌లో సోయా, పచ్చి మిర్చి, ఉల్లి, ఎల్లితో పాటు, నువ్వు పంటను సాగు చేసిన. ఈ పంటలకు చీడ పురుగుల బెడద ఎక్కువ ఉండదు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులను కేసీఆర్ ప్రభుత్వం ప్రోత్సహించింది.

-నంద ముత్యం, రైతు

### అడవి జంతువుల బెడద ఉండదు.



నా తోట అడవికి దగ్గర ఉండడంతో ఏ పంట వేసినా, రాత్రి పూట అటవీ జంతువులు వచ్చి నాశనం చేస్తున్నాయి. మా ఊరికి కొన్ని నెలల క్రితం అధికారులు వచ్చి మీటింగ్ పెట్టిండ్రు. ఆయిల్ పామ్ సాగు చేస్తే అడవి జంతువుల బెడద ఉండదని చెప్పిన్రు. ముందుగా రెండెకరాల్లో ఆయిల్‌పామ్ నర్సరీ నుంచి తీసుకువచ్చిన మొక్కలు పెట్టాను.

-చందాల మోహన్, రైతు

### అంతర పంటలుగా..

మొక్క నాటిన మొదటి ఏడాది నుంచి మూడేండ్ల వరకు ఆయిల్ పామ్ తోటలో అంతర పంటలను సాగు చేసుకోవచ్చు. పండ్ల తోటలైన జామ, అరటి, బొప్పాయి, వేరుశనగ, మక్క, పొద్దు తిరుగుడు, పెసర, మినుము, పత్తి, సోయా, మిర్చి, పల్లికాయ, నువ్వు, ఉల్లిగడ్డ వంటి పంటలను మూడేండ్ల వరకు సాగు చేయవచ్చు. ఈ పంట సాగులో తెగుళ్ల బెడద ఎక్కువగా ఉండదని వీటిని సాగు చేస్తే బాగుంటుందని అధికారులు చెబుతున్నారు. దీంతో అదనపు ఆదాయం పొందవచ్చునని ఉద్యాన వన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

### ఆయిల్ పామ్ పరిశ్రమ...

నిర్మల్ జిల్లాలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ కలిసి రైతులను చైతన్య పరుస్తూ రైతులను ఆయిల్‌పామ్ పంట సాగు చేసే విధంగా ప్రోత్సహిస్తున్నారు. దీంతో జిల్లాలో సాగు విస్తీర్ణం పెరగడంతో అప్పటి మంత్రి నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో రూ. 400 కోట్లతో ఈ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు అప్పటి ఐటీ శాఖ మంత్రి రామరావు చేతుల మీదుగా భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.

### నాలుగో ఏడాది నుంచి దిగుబడి..

వరితో పోలిస్తే 25 శాతం నీటితో ఆయిల్‌పామ్ సాగు చేయవచ్చు. నాలుగో ఏడాది నుంచి దిగుబడి వస్తుంది. నాలుగో సంవత్సరం నుంచి ఆరో సంవత్సరం వరకు ఎకరాకు 5 నుంచి 8 టన్నులు, 6 వ సంవత్సరం నుంచి సగుటున 10 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం టన్ను మద్దతు ధర రూ.13,500 ఉందని అధికారులు చెబుతున్నారు. రాబోవు రోజుల్లో ఈ పంటకు మంచి డిమాండ్ ఉంటుందని, ప్రస్తుతం ఈ పంటను సాగు చేసే రైతులు రూ. 1000 చెల్లిస్తే ఎకరాకు కావాల్సిన మొక్కలు, డ్రిప్ సిస్టమ్, ఉపాధి హామీ పథకం మూడేండ్ల వరకు నిర్వహణ ఖర్చులను సైతం ప్రభుత్వం రైతు ఖాతాల్లో జమ చేస్తుంది.

# అడుగంటిన ఆశలు

- నీళ్లు లేక.. ఎండుతున్న పొలాలు
- తడి కోసం ఆరాట పడుతున్న కర్షకులు
- భగీరథ ప్రయత్నం వృథా

దస్తురాబాద్, మార్చి 31: రోజురోజుకూ ఎండలు పెరుగుతుండడంతో చెరువులు, వాగులు, బోర్లు, వ్యవసాయ బావుల్లో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. పంటలు చేతికొచ్చే సమయంలో ఎండిపోతుండడంతో రైతన్నకు దిగులు తప్పడం లేదు. యాసంగి సీజన్‌లో వ్యవసాయబావులు, బోర్ బావుల్లో నీరుంటుందని ఎంతో ఆశతో రైతులు వరి పంటను వేశారు. కానీ కాలం కలిసి రాక రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. యాసంగిలో వరి పంటలకు నీరు లేక నెర్రెలుబారి ఎండిపోయే స్థితికి వచ్చాయి. గతేడాది యాసంగిలో నీళ్లు పుష్కలంగా ఉండడంతో పంటలు బాగా పండాయి. ఈ ఏడాది వానకాలంలో వర్షాలు అంతంత మాత్రంగానే కురియడంతో, భూమిలోకి నీరు పూర్తి స్థాయిలో చేరలేదు. భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్ బావుల నుంచి నీరు రావడం లేదు. దీంతో వేసిన వరి పైర్లు ఎండిపోయే పరిస్థితికి వచ్చింది. యాసంగి ప్రారంభంలో వ్యవసాయ బావులు, బోర్లలో పుష్కలంగా నీరు ఉండడంతో రైతులు ఎక్కువగా వరి పంటను సాగు చేశారు. తీరా కలుపు తీసే సమయానికి నీళ్లు తగ్గి పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. పంట చేతికొచ్చేందుకు ఇంకా రెండు నెలల


నీళ్లు సరిపోక పొలంలోనే బోర్ వేయిస్తున్న రైతులు


నీళ్లు లేక ఎండుతున్న వరి పంట

సమయం ఉండడంతో ఆశలు అడుగంటాయి. వరి పైర్లకు నీరందక కండ్లముందే పగుళ్లు ఏర్పడి ఎండిపోతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

### ఖర్చులు మోపెడు.. ఫలితం శూన్యం

పొలాలు ఎండిపోయే స్థితికి రావడంతో రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. వ్యవసాయ బావుల్లో పూడిక తీపిస్తున్నారు. అయినా ఫలితం శూన్యం. ఖర్చులు మీద పడుతున్నాయి తప్పా, నీళ్లు ఊరడం లేదు. కొన్ని చోట్ల పంట పొట్ట దశకు చేరుకోవడంతో, దానిని కాపాడుకోవడానికి వేల రూపాయాలను ఖర్చు చేసి బోర్లను రైతులు వేపిస్తున్నారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా విచ్చల విడిగా రైతులు బోర్లను తమ పంట పొలాల వద్ద వేపిస్తున్నారు. గత పదేండ్లలో వ్యవసాయ బావుల్లో పూడిక తీసే ఆలోచన లేకుండే. కానీ ఈ యాసంగిలో ఎక్కడ చూసినా వ్యవసాయ బావుల్లో పూడికతీత తీసే పని కనిపిస్తుంది. వ్యవసాయ బావులు, బోర్లలో నీళ్లు ఎప్పుడు తగ్గిపోతాయే తెలియని పరిస్థితి. ఒక్క తడికి కూడా నీళ్లు సరిపోవడం లేదు. పొలం వద్దనే రైతులు పడిగాపులు కాసి నీళ్లు ఊరిన తర్వాత మోటరు వేసి పంటకు నీళ్లు పారిస్తున్నాడు. వరి సాగు చేసి నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


రేవోజిపేటలో బస్సుకోసం వేచి చూస్తున్న ప్రయాణికులు,విద్యార్థులు

## బస్టాండ్ లేక.. ఎండలోనే జనం

దస్తురాబాద్,మార్చి 31: అసలే ఎండలు ముదురుతున్నాయి. మండలంలోని కొన్ని గ్రామాల్లో బస్టాండ్లు లేకపోడంతో రోడ్డు పైన ఉండలేక ప్రయాణికులు, విద్యార్థులు చెట్ల కింద, కిరాణా దుకాణాల వద్ద ఉండి బస్సుల కోసం వేచి చూస్తున్నారు. మండలంలోని రేవోజిపేట, గొడిసేర్యాల ఎక్స్ రోడ్డు, బుట్టాపూర్, మున్యాల తండా ప్రజలు బస్టాండ్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక మండల కేంద్రంతో పాటు, మున్యాల, పెర్కపల్లె గ్రా మాల్లో బస్టాండ్లు ఉన్నా, వినియోగంలో లేవు. సం బంధిత అధికారులు స్పందించి, బస్టాండ్లు ఏర్పా టు చేయాలని ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు.

## ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 31: జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కూరగాయల మార్కెట్ వద్ద సీ ఈఈ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ ను నిషేధించి చేతి సంచులను వాడాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు, కళాకారులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

## బాసర ఆలయంలో దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్

- స్టోర్ రూం తనిఖీ
- పలు రికార్డుల పరిశీలన


తనిఖీ చేస్తున్న అధికారులు

బాసర, మార్చి 31 : బాసర సరస్వతీ ఆలయంలో దేవాదాయశాఖ అదనపు కమిషనర్ కృష్ణవేణి ఆదివారం తనిఖీ నిర్వహించారు. లడ్డూ, పులిహోర తయారు చేసే స్టోర్ రూంను పరిశీలించి, అక్కడి సామగ్రి, నాణ్యత, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఈవో కార్యాలయంలో పలు రికార్డులు, పత్రాలను పరిశీలించారు. నివేదికలను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు సమాచారం. ఈ తనిఖీ కార్డుల పరిశీలన మీడియాకు తెలియకుండా చాలా గోప్యంగా నిర్వహించారు. ఈమె వెంట ఏవో విజయరామరావు, ఏఈవో సుదర్శన్ తదితరులున్నారు.

## ఉద్యోగులకు విరమణ సహజమే

- ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, మార్చి 31: ఉద్యోగులకు విరమణ సహజమేనని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని గౌరీ శంకర్ ఫంక్షన్ హాల్‌లో లోకేశ్వరం బీసీ హస్టల్ గ్రేడ్ -1 సంక్షేమాధికారి విఠోలి నాగారావు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వార్డెన్‌గా చేసిన సేవలను కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం సుఖ సంతోషాలతో జీవితాన్ని గడపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రావు పటేల్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారావు, టీఎన్‌జీవో నాయకులు రమణ రావు, ప్రభాకర్, అశోక్, నల్ల నాగుల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


నాగారావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

## జేఎన్‌వీలో సీట్లు

కుంటాల, మార్చి 31 : ఆదివారం విడుదలైన జవహర్ నవోదయ విద్యాలయాల్లో మండలంలోని సృజన విద్యానిలయం నుంచి 29 మంది విద్యార్థులు, శాంతినికేతన్ విద్యానిలయం 14, విజయసాయి స్కూల్ ఒక సీటు, కల్లూరులోని సాయి మోడల్ స్కూల్ 5 సీట్లు, సంపాదించినట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గంగన్న, సంతోష్, శ్రీకాంత్, స్వప్న, ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉపాధ్యాయులు అభినందించారు.

## ఘనంగా ఈస్టర్ వేడుకలు

నిర్మల్ టౌన్.మార్చి 31: పట్టణంలోని గాజులపేట్ చర్చిలో ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చి ఫాదర్ సుశీల్‌కుమార్ దైవ సందేశం వినిపించారు. పండుగ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ప్రత్యేక పార్థనలు చేశారు. భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, సురేందర్, అనిల్, ఆనంద్, జయ, విశాల్ పాల్గొన్నారు.

## సీఐటీయూలో చేరిన నాయకులు

నిర్మల్ టౌన్, మార్చి 31: నిర్మల్ జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయంలో ఏఐటీయూసీకి చెందిన పలువురు నాయకులు సంఘంలో చేరినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేశ్‌ఆదివారం తెలిపారు. ఏఐటీయూసీకి చెందిన ఊట్ల అంజయ్యతో పాటు మరో 10 మంది సంఘం నాయకులు సీఐటీయూలో చేరినట్లు పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం కోసం సీఐటీయూ చేస్తున్న పోరాటాలను ముందుకు నడిపేందుకు ఈ సంఘంలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కోగం రాజు, పోశెట్టి, అతిక్ తదితరులున్నారు.

## ఆత్రం సక్కును గెలిపించాలి

ఇంద్రవెల్లి, మార్చి 31: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ రాష్ట్ర నాయకుడు బాదవత్ పుర్ణచందర్‌నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం దస్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కోయల్‌పాండ్రిలో ఆదివాసీ గిరిజన నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు ఎల్లప్పుడు అండగా నిలువాలన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం ప్రజలకు అమలు చేయని సంక్షేమ పథకాలను కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లు అందించిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. ఆ రెండు పార్టీలకు చెందిన వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, ఆదివాసీ గిరిజన నాయకుడు పుర్కా చిత్రు, గ్రామస్తులు పాల్గొన్నారు.


కవులను సన్మానిస్తున్న నిర్వాహకులు

## నిర్మల్ కవులకు సన్మానం

నిర్మల్ టౌన్/చైన్‌గేట్, మార్చి 31: కలం స్నేహం సాహిత్య అకాడమీ ఆధ్వర్యం లో హైదరాబాద్‌లో ఆదివారం కళాభారతి సెంటర్‌లో నిర్మల్ కవులను ఘనంగా సన్మానించారు. సాహిత్య రంగంలో సేవలందిస్తున్న కవులు దేవిప్రియ, కడారి దశరథ్, పోతన్న, శోభారాణి,శంకర్ తదితర కవుల ను కలం స్నేహ నిర్వాహకులు గోపాల్ ఆచార్య ఆధ్వర్యంలో సన్మానం అందుకున్నారు. వీరిని నిర్మల్ కవులు అభినందించారు.

## హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరి

నిర్మల్(చైన్‌గేట్), మార్చి 31: వాహనాలకు తప్పనిసరిగా హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని నిర్మల్ పట్టణ సీఐ అనిల్ సూచించారు. నిర్మల్ పట్టణంలోని మహాలక్ష్మీ వాడలో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిస కావొద్దని సూచించారు. సైబర్ నేరాలు, సీసీ కెమెరాలు, డయల్ 100, షీటీమ్స్ ఇతర విషయాలపై అవగాహన కల్పించారు. ధ్రువీకరణ పత్రాలు సరిగాలేని 45 బైకులు, 6 ఆటోలు సీజ్ చేశారు. పట్టణ ఎస్ఐలు రాజేశ్వర్ గౌడ్, సుమలత, ఏఎస్ఐ బాబారావు, సిబ్బంది ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు

## కరెంట్‌షాక్‌తో ఎద్దు మృతి

సారంగాపూర్, మార్చి 31: మండలంలోని జామ్‌లో తుల సుదర్శన్‌కు చెందిన ఎద్దు కరెంట్‌షాక్‌తో మృతి చెందింది. పొలంలో ఎద్దు మేత మేయడానికి వెళ్లగా, ట్రాన్స్‌ఫార్మర్ గద్దె ఎత్తు తక్కువగా ఉండడం మూలంగా 11కేవీ విద్యుత్ తీగ తగలి మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. ఎద్దు విలువ రూ. 1లక్ష ఉంటుంది. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

## చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య

లోకేశ్వరం, మార్చి 31: మండలంలోని బిలోలి గ్రామానికి చెందిన జోగోల ప్రశాంత్ (24) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రశాంత్ కొన్ని నెలలుగా మద్యానికి బానిసై ఇంట్లో గొడవపడేవాడని, శనివారం కూడా మద్యం తాగి గొడవకు దిగాడని తెలిపారు. ఈ క్రమంలో ప్రశాంత్ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి గ్రామ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### తాగుడుకు బానిసై..

కుబీర్, మార్చి 31: మండలంలోని న్యూసాప్లి గ్రామానికి చెందిన జంగి గంగాధర్(45) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తాగిన మైకంలో ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

సోన్, మార్చి 31: నిర్మల్ పట్టణంలోని విశ్వనాథ్‌పేట్ కాలనీలో నాలుగైదు రోజులుగా భిక్షాటన చేస్తున్న ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందినట్లు నిర్మల్ రూరల్ ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వనాథ్‌పేట్‌లో నాలుగైదు రోజుల నుంచి ఓ వృద్ధుడు భిక్షాటన చేసి అక్కడ ఓ దుకాణం వద్ద పడుకుంటున్నాడు. ఆదివారం ఉదయం మృతి చెంది ఉండడంతో, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వృద్ధుడి వయస్సు సుమారు 70-75 సంవత్సరాల వయస్సు ఉందని, నలుపు గోధుమ కలర్ చెక్స్ షర్ట్, నిక్కర్ ధరించి ఉన్నట్లు చెప్పారు. సమాచారం తెలిస్తే నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్, ఫోన్ నంబర్ 8712659515లో సంప్రదించాలని కోరారు.

## నేడు వైస్ ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం

సారంగాపూర్, మార్చి 31: సారంగాపూర్ ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో తిరుపతిరెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని, 13 మంది ఎంపీటీసీలు హాజరవ్వాలని కోరారు. సమావేశ అనంతరం వైస్ ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ఉంటుందన్నారు. సభ్యులందరూ సకాలంలో హాజరవ్వాలని కోరారు.

## నేడు ట్రెజరీ అధికారికి సన్మానం

నిర్మల్ టౌన్, మార్చి 31: నిర్మల్ జిల్లా ట్రెజరీ అధికారి ప్రభాకర్ రావుకు సోమవారం నిర్మల్ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పెన్షనర్ల సంఘంలో సాయంత్రం 6 గంటలకు సన్మానం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పెన్షనర్లు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని పిలుపునిచ్చారు.

## విద్యార్థులు లక్ష్యంతో చదవాలి


పాల్గొన్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, మార్చి 31: విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ సూచించారు. కిసాన్ గల్లీలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో శనివారం రాత్రి వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాగనాథ్ పటేల్, డా. దామోదర్ రెడ్డి, డా. నరేశ్, వెంకటేశ్, సాదుల కృష్ణదాస్, డా. నగేష్, శిశు మందిర్ హెచ్ఎం భోజన్న, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.